క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి చీరల వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ నాన్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల భార్యలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ నాన్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల భార్యలు ఓ అసోసియేషన్‌గా ఏర్పడి స్థానిక వృద్ధాశ్రమంలోని మహిళలకు వస్త్రాలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహిళలు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తాము కొంత నిధి సమకూర్చి దాని ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

రైతు బజారులో సబ్సిడీ టమాటా విక్రయాలు



వినియోగదారులకు సబ్సిడీ టమాటాలు అందిస్తున్న జేడీ సుధాకర్

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో సబ్సిడీ టమాటా విక్రయాలను ఆదివారం జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పి. సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రైతు బజారుకు 50 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. బజారులో 4 కౌంటర్లలో కిలో రూ.50 చొప్పున అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. వినియోగదారులు తప్పని సరి గా ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకు రావాలని కోరారు. అధిక సంఖ్యలో వినియోగదారులు వచ్చి టమాటాలు క్యూలైన్లో వేచి ఉండి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో డీడీ ఎర్రన్న, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఈవో నారాయణరావు, సహాయకుడు శివ పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగి అదృశ్యం



అదృశ్యమైన ధీరజ్‌కుమార్

మల్కాపురం: ఓ యుద్ధ నౌకలో సెయిలర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అదృశ్యం అయ్యాడు. తూర్పు నౌకాదళం విభాగంలో ఎన్ఎస్ఎస్ వీరబాహు నౌకలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (28) ఈ ఏడాది జనవరిలో సెయిలర్‌గా (ఆర్ఎంఎస్ ర్యాంక్) చేరాడు. వీరికి ఆ నౌకలోనే భోజనం, వసతి సదుపాయం వంటివి అధికారులు కల్పిస్తారు. విధులు అనంతరం ప్రతి రోజు సాయంత్రం వీరు అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వస్తుండేవారు. ధీరజ్ శనివారం సాయంత్రం విధులు ముగించుకొని అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తోటి సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు అతడి ఆచూకీ కోసం నౌకాపరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఫలితం లేకపోవటంతో ఆదివారం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ సుశీల్ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. మల్కాపురం ఎస్‌ఐ దేవుడమ్మ ఎన్ఎస్ఎస్ సింధూకేసరి నౌక వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఇన్, అవుట్ గేట్ల వద్ద గల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ స్కిట్లు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ఆద్యంతం నవ్వులు పూయించింది. కామెడీ ఆర్టిస్టులు జబర్దస్త్ ప్రకాష్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, రావి గోపీకృష్ణ, భానుప్రకాష్, శివజ్యోతి, అన్వేషు, దామోదర్, ఇమంది ఈశ్వరరావు, జి.వి.త్రినాథ్, బుగత సత్యనారాయణ, శ్రీధర్, పుష్పమి, మల్లిక, పోర్టు శేషులు ప్రదర్శించిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. ఫోన్ చేసి మరీ అడగాల, కుక్క కరిచింది, కుక్కను అమ్మేస్తా, రక్తం, ఆర్టీసీ బస్సు, ఎఫ్4, స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా కళాకారులను నందూరి రామకృష్ణ, ఎ.వి.రామకృష్ణ, దాసరి సాంబశివరావు తదితరులు సత్కరించారు.



ఉల్లిపాయల వ్యాపారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద ప్రసాదం పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



జాతీయ రహదారి వద్ద భక్తుల రద్దీ

గిరి భక్తుల సేవలో..

- గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- భక్తుల సేవలో తరించిన స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు
- మజ్జిగ, తినుబండారాలు, పులిహోర పంపిణీ



గిరి భక్తులకు ప్రసాదం అందిస్తున్న, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ



సీతారామరాజునగర్ వద్ద గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు పాద సేవ చేస్తున్న సత్య సాయిబాబా భక్తులు



జాతీయ రహదారిపై పోలీసుల బందోబస్తు

గోపాలపట్నం: తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి అప్పన్న రథం వెంట అశేష భక్తవాహిని కదిలింది. నృసింహ స్వామి నామాన్ని జపిస్తూ గిరి ప్రదక్షిణ మొదలు పెట్టారు. సాయంత్రం అయ్యేసరికి అప్పన్న తొలిపావంచా నుంచి ఎన్ఏడీ వరకు భక్తజనం పోటెత్తారు. అదిగో సింహగిరి అంటూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. సుసర్ల కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్ మీదుగా భక్తులు నడిచి వెళ్లారు.

భక్తుల సేవలో సంస్థలు

జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్ వద్ద గోపాలపట్నం భగవాన్ సత్య సాయిబాబా భజన మండలి సభ్యులు గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ప్రత్యేక ఆయిల్‌తో కాళ్లకు మర్దన చేసే శిబిరం ఏర్పాటు చేశారు. వారికి ప్రసాదాలు, మంచినీరు, మజ్జిగ అందించారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వద్ద కొందరు భక్తులకు అల్పాహారాలు అందించారు. వంటిల్లు వద్ద వాహనాల వల్ల భక్తులకు ఇబ్బంది లేకుండా బేరికేడ్లు ఏర్పాటు చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

గోపాలపట్నంలో ట్రాఫిక్ జామ్...

నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఆటోలు బస్సులు, ద్విచక్రవాహనాల్లో వచ్చే భక్తులను సింహాచలం రోడ్డులోకి అనుమతించక పోవడంతో గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద ట్రాఫిక్ జామయింది. చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది. అయితే వాహనదారులకు నాయుడు తోట మీదుగా వెళ్లేందుకు అవకాశం కల్పించారు.

సేవల్లో భూషణం మాస్టారు

నిషేధిత ప్లాస్టిక్ వాడవద్దంటూ భూషణం మాస్టారు ప్లకార్డులు పట్టుకుని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి పెను ముప్పు అని వివరించారు. భక్తులు వ్యర్థాలు డస్ట్ బిన్లలో వేయాలని కోరారు.

పోలీస్ బందో బస్తు

గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు పక్కా వ్యూహంతో ఏర్పాట్లు చేశారు. వాహనాదారులతో పాటు గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. పోలీసుల చర్యలను భక్తులు అభినందించారు. గతంలో కంటే ఈ సారి ఏర్పాట్లు చాలా బాగున్నాయిని హర్షం వ్యక్తం చేశారు.



భక్తులకు అల్పహారం అందిస్తున్న కృష్ణ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ ఫోరమ్ సభ్యులు



గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు పాద సేవ చేస్తున్న సత్య సాయిబాబా భక్తులు



ప్రకృతిని కాపాడాలని అవగాహన కల్పిస్తున్న భూషణం మాస్టారు

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో కొలువుదీరిన సద్గురు సాయినాథుడి ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సాయిబాబాకు క్షీరాభిషేకం ,విభూది అభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా చేపట్టిన పూజల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, 58,59,60వ వార్డుల పార్టీ పరిశీలకులు పిల్లా కన్నబాబు, కనక మహాలక్ష్మి దేవ స్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత, 58వ వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, అంగ రామ్‌ప్రసాద్,మనోహర్,ఉద్దా భాస్కర్,ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉపాలి బుద్ధవిహార్ వార్షికోత్సవం



బౌద్ధమతానికి గౌరవ వందనం చేస్తున్న బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు

సింధియా: దమ్మ చక్ర ప్రవర్తన సూక్త ప్రారంభమై నేటికి 2612 ఏళ్లు పూర్తయిందని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ఎలిచర్ల హరిబాబు అన్నారు. మల్కాపురంలో ఆదివారం 55వ ఉపాలి బుద్ధవిహార్ దమ్మ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞ, బౌద్ధ ప్రచారక్, న్యాయవాది ములపర్తి గౌతమి కాంత్ మాట్లాడుతూ భారతదేశంలో పుట్టిన బౌద్ధం కొలంబియా, థాయిలాండ్, మయన్మార్, భూటాన్, శ్రీలంక, మంగోలియా, లియోస్, జపాన్, సింగపూర్, సౌత్‌కొరియా వంటి దేశాల్లో విస్తరించిందన్నారు. ఇండియాలో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ సందర్భంగా మల్కాపురం కూడలి నుంచి సిద్ధార్థకాలనీ, ప్రకాష్‌నగర్, అంబేడ్కర్ సర్కిల్, ఉపాలి బుద్ధవిహార్ వరకు బౌద్ధ మత పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. పెయ్యిల సిద్ధార్థ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో తిరుకోటి చైతన్యకుమార్, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దాడులను నిరసిస్తూ క్రైస్తవుల ర్యాలీ



జ్ఞానాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం : మణిపూర్‌లో జరుగుతున్న మారణ కాండకు, క్రైస్తవులపై దాడులను ఖండిస్తూ ఆదివారం జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రక్షణగిరి రహదారిలో సెయింట్ పీటర్స్ స్త్రీల కమిషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సెయింట్ పీటర్స్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్, సిస్టర్ సంగీత నేతృత్వంలో జ్ఞానాపురం గ్రామ మహిళలు సెయింట్ పీటర్స్ చర్చి నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం రక్షణగిరి ముఖద్వారం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. క్రైస్తవులపై దాడులు అమానుషమన్నారు. వారికి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీల కమిషన్ అధ్యక్షురాలు జీఎల్ రాణి, ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి పి.వేళాంగిణి, కోశాధికారి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికుల జీతాలు తక్షణం పెంచాలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో దిబ్బపాలెం పెద్దమ్మోరు ఆలయం వద్ద నుంచి పోర్టు వంతెన జంక్షన్ వద్ద గల గాంధీ విగ్రహం వరకూ ఆదివారం కుటుంబాలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఆపాలన్నారు. వారికి నెలకు రూ. 36 వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నుంచి అక్రమంగా తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న కార్మికుల పిల్లలు అదానీ తాతయ్య మా నాన్న జీతాలు పెంచవా అంటూ ప్లకార్డులు ప్రదర్శించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న పరిశ్రమల శాఖ కమిషనర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ప్రవీణ్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లకార్డులతో వెళ్తున్న బాబూరావు తదితరులు

సింహాచలం: ప్లాస్టిక్‌ను నిషేధించాలని, పర్యావరణాన్ని కాపాడాలని గిరిప్రదక్షిణలో ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గోపాలపట్నం ప్రభుత్వ హైస్కూల్ జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాబురావు ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన కల్పించారు. భక్తులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. చెట్లను నరికి వేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

పొంచి ఉన్న ప్రమాదం..

- హెచ్‌డీ విద్యుత్ స్తంభాలపై పచ్చని పొదలు
- కరెంట్ షాక్‌తో స్థానికుల భయంభయం



సెబాస్టియన్ కాలనీలో హెచ్‌డీ పోల్‌కు అల్లుకున్న పచ్చని పొదలు



గొల్లకంచరపాలెం సబ్‌వే మార్గంలో ఇలా..

కంచరపాలెం : పచ్చని పొదలు, మొక్కలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయి. మానవాళికి మేలు చేస్తాయి. అయితే 41, 56 వార్డుల్లోని జ్ఞానాపురం సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, ఎర్రిగెడ్డ పరిధిలోని ప్రాంతాలు, కంచరపాలెం ఆర్‌పీపేట రైల్వే గేటు రహదారి నుంచి ఊర్వశి కూడలికి వెళ్లే రహదారిలో ప్రమాదభరితంగా పెరిగిన పొదలు, తీగలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇవి హెచ్‌డీ (రాకెట్ పోల్స్) విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయి ఇష్టానుసారం పెరిగిపోతున్నాయి. దీనివల్ల వర్షాకాలంలో ఈ స్తంభాల సమీపం నుండి వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. పచ్చనితీగలు తాకినప్పుడు విద్యుత్ షాక్ కొడుతుందని భయాందోళన చెందుతున్నారు. వీటిని తొలగించాలని కంచరపాలెం జోన్–2 ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్ మహిళలకు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: అర్హత ఉంటే చాలు.. సంక్షేమ పథకం వారి తలుపు తడుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు వాయుపుత్రకాలనీలో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్‌కుమార్ పలు నివాసాల వద్దకు వెళ్లి మహిళలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతి పేద వాడిని ఆర్థికంగా ఆదుకోవాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అమలు చేస్తున్నారన్నారు. అలాగే ప్రతి పేద విద్యార్థి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్య అమలు వారిఉన్నత చదువుకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. పలువురు మహిళలు అర్హత ఉన్నా పలు పథకాలు రాలేదని వివరించారు. వారి అర్హత పత్రాలను ఆయన పరిశీలించి, అర్హతను గుర్తించి పథకం వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పుర్రె సురేష్ యాదవ్,వార్డు పార్టీ ఇన్‌చార్జి రేవళ్ల సత్యనారాయణ, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి



రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న నాయకులు

మర్రిపాలెం: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఏబీసీఎఫ్ జాతీయ కార్యదర్శి ఆల్మన్‌రాజు అన్నారు. ఈ మేరకు 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖతో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో జాతీయ స్థాయిలో వెనుకబడిన తరగతుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనేక జాతీయ అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీ జనగణన కులాల వారీగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించామన్నారు. సమాజంలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ పార్టీలకు మనుగడ లేకుండా చేయాలన్నారు. జాతీయ స్థాయిలో ఈబీసీ, ఎంబీసీ కుల గణన వంటి అంశాలను లేవనెత్తుతూ రాజీలేని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకత్వంలో బీసీ ఉద్యమం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రోత్సహించిన రాజకీయ పార్టీలను మాత్రమే ఆదరించాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్‌రావును ఏబీసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య పంపిన ఉత్తర్వులను ఆల్మన్‌రాజు అందజేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ బీసీల సమస్యలపై జాతీయ స్థాయిలో రాజీలేని పోరాటం చేస్తున్న యోధుడు జస్టిస్ ఈశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.